క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన

చాపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన అందుతుందని ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో అసిస్టెంట్‌ మేనేజర్‌ లావణ్య తెలిపారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ప్రొద్దుటూరుకు చెందిన బి.చంద్రశేఖర్‌ తన సతీమణి కే.శే.ప్రమీల జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్‌ పాసులను పంపిణీ చేసి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆమె విద్యార్థులకు బస్‌ పాసులను అందించారు. గురుకుల పాఠశాల స్పెషలాఫీసర్‌ నాగలక్ష్మీ, ఆర్టీసీ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ బీవీ ప్రతాప్‌రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్‌ హనీఫ్‌బాబా

ప్రొద్దుటూరు క్రైం : కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని గోపవరం సచివాలయంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్‌ కాన్సెప్ట్‌ కార్యక్రమంలో భాగంగా డాక్టర్‌ హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వృద్ధులకు బీపీ, షుగర్‌తో పాటు గర్భిణులు, బాలింతలకు 14 రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, డీఈఓ దేవరాజ్‌, హెచ్‌ఈ శోభారాణి, ఆరోగ్యకార్యకర్త చంద్ర, సీహెచ్‌ఓ నాగేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సుఖ వ్యాధులపై అవగాహన

చాపాడు : మండలంలోని లక్ష్మీపేట గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ చైల్డ్‌ ఫండ్‌ ఇండియా లింక్‌ వర్కర్స్‌ స్కీం ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, సుఖ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్‌ ఫండ్‌ వర్కర్స్‌ స్కీం సూపర్‌వైజర్‌ దర్బార్‌ మాట్లాడుతూ హెచ్‌ఐవీ సోకడం వలన కలిగే నష్టాలపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. నియంత్రణ లేని, భద్రత లేని లైంగికానికి దూరంగా ఉండాలన్నారు. సుఖ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండటం వలన వాటి నుంచి దూరంగా ఉండోచ్చన్నారు. అనంతరం పలువురికి హెచ్‌ఐవీ, సుఖ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు, ఏఎస్‌ఎం కీర్తి, చైల్డ్‌ ఫండ్‌ ఇండియా లింక్‌ వర్కర్స్‌ స్కీం సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


దారి సౌకర్యం కల్పించాలని వినతి



పెద్దశెట్టిపల్లె ఎస్సీ కాలనీలో సిమెంటు రోడ్డుపై అడ్డంగా కట్టిన గోడ

ప్రొద్దుటూరు : తమ ఇంటి వద్ద రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన ఎర్ర దాసరి మేరీ, శాలిని బుధవారం తహసీల్దార్‌ నజీర్‌అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామం పరిధిలోని ఎస్సీ కాలనీలో తాము నివాసం ఉంటున్నామని గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డుపై మాజీ సర్పంచ్‌ పైడికాలువ భారతి, ఆమె భర్త వెంకటసుబ్బయ్య గోడ నిర్మించారన్నారు. పబ్లిక్‌ రస్తాలో గోడ నిర్మించడంతో తాము నడవడానికి వీలులేకుండా పోయిందన్నారు. రూ.లక్ష నిధులతో సిమెంటు రోడ్డును 2015లో గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించారన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



సుబ్బరాయుడు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సభ్యులు

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని ఈశ్వర్‌రెడ్డి నగర్‌కు చెందిన అనాథ కంభం సుబ్బరాయుడు బుధవారం మరణించారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో మే ఐ హెల్ప్‌ యూ ఫౌండేషన్‌ చైర్మన్‌ మోరే లక్ష్మణరావు తన సిబ్బందితో కలసి సుబ్బరాయుడు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ సభ్యులు తిరుపాల్‌, భార్గవ్‌ సాయి, భరత్‌ కుమార్‌రెడ్డి, సీఈఓ మల్లికార్జున పాల్గొన్నారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్‌ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె, విజయనగరం గ్రామాలలో గురువారం ఫ్యామిలీ డాక్టర్‌ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్‌ రాజేష్‌కుమార్‌ తెలిపారు. గ్రామాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

చంద్రయాన్‌-3 విజయవంతంపై సంబరాలు



బద్వేలులో సంబరాలు జరుపుకుంటున్న యువకులు



ప్రొద్దుటూరు : దొరసానిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

బద్వేలు అర్బన్‌ : చంద్రయాన్‌-3 విజయవంతంపై బుధవారం స్థానిక పోరుమామిళ్ళ రోడ్డులోని గాంధీబొమ్మ సర్కిల్‌లో యువకులు సంబరాలు జరుపుకున్నారు. భారీ ఎత్తున బాణాసంచా కాల్చి కేక్‌ కట్‌ చేసి స్వీట్లు పంచిపెట్టారు. జయహో భారత్‌, జయహో ఇస్రో అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు పెద్ది సుధాకర్‌, బాసికాలశ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రయాన్‌-3 విజయవంతంతో భారతదేశ కీర్తిప్రతిష్టలు విశ్వవ్యాప్తమయ్యాయన్నారు. చంద్రయాన్‌-3 విజయవంతం కావడానికి అహర్నిశలు శ్రమించిన ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు : భారత్‌ ప్రయోగించిన చంద్రయాన్‌-3 విజయవంతంపై మైదుకూరులో బుధవారం పట్టణంలోని ఉన్నత పాఠశాలలు వ్యాపార సంస్థలు నివాసాల్లో విక్రమ్‌ సాఫ్ట్‌ లాండింగ్‌ను వీక్షించారు. హర్షాతిరేకంతో సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని రాయల కూడలిలో పలువురు జాతీయ జెండాలను చేతబట్టి బాణసంచా పేల్చి జయహో భారత్‌ అంటూ నినాదాలు చేశారు.

ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరు : చంద్రయాన్‌ 3 విజయవంతం కావడంతో విద్యార్థులు, ప్రజలు సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ (ఇంట్రాక్టివ్‌ ఫ్లాట్‌ ప్యానల్‌) ద్వారా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు లైవ్‌ ప్రోగ్రాం చూపించారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రాజెక్టర్లను ఏర్పాటు చేసి విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని చూపించారు.

■ స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో చంద్రయాన్‌-3 ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు వీక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ జగదీశ్వరుడు, అధ్యాపకులు, విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఇస్రో చైర్మన్‌ డాక్టర్‌ ఎస్‌.సోమనాథ్‌కు సేవ్‌ గర్ల్స్‌ చైల్డ్‌ ప్రాజెక్టు డైరెక్టర్‌ తుపాకుల రామాంజనేయులరెడ్డి ఆయన చిత్రాన్ని గీసి బహూకరించారు.

సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం



నందిపల్లెలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ

బద్వేలు అర్బన్‌ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం కనిపిస్తోందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని వనంపుల పంచాయతీ బాలాయపల్లె ఎస్సీకాలనీ, నందిపల్లె గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టోను ఒక భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా భావించి అందులో పొందుపరిచిన ప్రతి హామీని అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, వైద్యం, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు దేశంలో ఎక్కడా అమలులో లేని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ఈ నాలుగేళ్ళ కాలంలో ఇప్పటికే ప్రతి కుటుంబానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరిందని, మరో ఏడాది పాలనలో మరింత లబ్ధి చేకూరనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బిజి వేముల లక్ష్మిదేవి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, వైస్‌ఎంపీపీలు నరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, మండల కన్వీనర్‌ మల్లేశ్వర్‌రెడ్డి, పంచాయతీ ఇన్‌చార్జి రాజగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు వేణు, ఓబులేసు, శేషారెడ్డి, వీరారెడ్డి, రామచంద్ర, బొగ్గులవీరారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్‌, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత ప్రతిష్ట వార్షికోత్సవాలు



వజ్రపు చీర, కిరీటంతో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో బుధవారం వాసవీమాత ప్రతిష్ఠ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని సాలగ్రామహారంతో అలంకరించారు. గణపతి, రుద్ర, నవగ్రహ, చండీ హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను వజ్రపుచీర, కిరీటంతో అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహనరావు, కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నీటిట్యాంకర్‌ ఏర్పాటు

ప్రొద్దుటూరు : మండలంలోని చెన్నమరాజుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌ సీపీ నాయకుడు నశ్యం శ్రీనివాసులు సొంత డబ్బుతో నీటిట్యాంకర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నారు. దాదాపు మూడు వారాలుగా గ్రామంలో నీటి సమస్య ఏర్పడటంతో ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి రోజూ 8 ట్యాంకర్ల నీటిని అందిస్తున్నారు. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కడపలో తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటు చేయాలి

గోపవరం : వైఎస్సార్‌ జిల్లా కేంద్రమైన కడప నగరం నడిబొడ్డులో తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని ఏపీ తెలుగుభాషా వికాస ఉద్యమం జిల్లా అధ్యక్షుడు విద్వాన్‌ డాక్టర్‌ గానుగపెంట హనుమంతరావు కోరారు. బుధవారం మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో తెలుగుతల్లి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలుగుజాతి ఔన్నత్యాన్ని, వైభవ ప్రాభవాల స్మృతి చిహ్నంగా నిలిచిన తెలుగుతల్లి విగ్రహం జిల్లా కేంద్రంలోనే కాక ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. అలాగే 2006 నుంచి అధికార భాషా సంఘానికి జిల్లా కమిటీ లేదన్నారు. భాషాభిమానులతో నూతన కమిటీ ఏర్పాటు చేసి తెలుగుభాషా వికాసానికి కృషి చేయాలన్నారు. తెలుగులో నామఫలకాలు, ఉత్తరప్రత్యుత్తరములు కొనసాగించాలన్నారు.

విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండాలి



విద్యార్థులకు బహుమతులు అందజేసిన సంస్థ గౌరవ సలహాదారు శ్రీధర్‌రెడ్డి

కాశినాయన : విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండాలని వివేకానంద ఫౌండేషన్‌ సంస్థ గౌరవ సలహాదారు రాజోలి శ్రీధర్‌రెడ్డి, మదర్‌థెరిసా ఫౌండేషన్‌ చైర్మన్‌ చిత్తా రవిప్రకాష్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం మండలంలోని మోడల్‌ పాఠశాల, వరికుంట్ల కస్తూర్బాగాంధీ పాఠశాలల విద్యార్థులకు మానవతా విలువలపై చైతన్య సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. లక్ష్యం పట్ల స్పష్టత కలిగి ఉండి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని ప్రవర్తించాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మోడల్‌ పాఠశాల ప్రిన్సిపాల్‌ సౌజన్య, కస్తూర్బాగాంధీ పాఠశాల ఎస్‌ఓ మెర్సీ, వివేకానంద ఫౌండేషన్‌ సంస్థ వ్యవస్థాపకులు పి.రామకృష్ణారెడ్డి, సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

బ్రహ్మంగారిమఠం : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్‌ పథక అధికారి డాక్టర్‌ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పలుగురాళ్లపల్లె జిల్లా పరిషత్‌ హైస్కూల్‌ను నాడు-నేడు కింద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. నిరుపేద విద్యార్థికి కూడా కార్పొరేట్‌ విద్యా వ్యవస్థను తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. పాఠశాలలో నాడు-నేడు కింద చేపట్టిన నిర్మాణాలను నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనురాగం, అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్‌

బద్వేలు అర్బన్‌ : మానవీయ సంబంధాలను పటిష్టం చేస్తూ ప్రేమానురాగాలను పెంచడమే రక్షాబంధన్‌ ఉద్దేశ్యమని బ్రహ్మకుమారి ఈశ్వరీయ సంస్థ ఏపీ, కర్ణాటక రాష్ట్రాల ఇన్‌చార్జి లీలబెహన్‌జీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోరుమామిళ్ళ రోడ్డులోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కార్యాలయంలో రక్షాబంధన్‌ ఆవశ్యకతపై నిర్వహించిన అవగాహన సదస్సులో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్‌ సుధకు రాఖీ కట్టి సన్మానించారు. బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రపై సమీక్ష

అట్లూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఎంపీడీఓ సుజాతమ్మ అధ్యక్షతన బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సెక్రటరీలు, వ్యాయామ ఉపాధ్యాయులతో ఆమె సమీక్ష నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర పోటీలను మండలంలో ఆదర్శవంతంగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు. తహసీల్దారు శ్రీవాణి, ఎంఈఓ విలియం పాల్గొన్నారు.

'టీడీపీతో కుమ్మక్కయ్యే.. ఉపకుల ప్రస్తావన'



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి

మైదుకూరు : మండలంలోని భూ సమస్య విషయంలో నియోజకవర్గంలోని దువ్వూరు మండలానికి చెందిన సంఘన కిషోర్‌రెడ్డి ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై నిందారోపణలు చేయడం మంచిది కాదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోకుండా వైఎస్సార్‌సీపీ నాయకుడినంటూనే రచ్చకెక్కడం శోచనీయమని వారు పేర్కొన్నారు. టీడీపీతో కుమ్మక్కయ్యే.. రెడ్డి కులంలోని ఉపకులాలను ప్రస్తావించారని కిషోర్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. మైదుకూరు మండలం బసవాపురం దగ్గర ఉన్న ఓ భూమి విషయంలో కిషోర్‌రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై ఆరోపణలు చేస్తూ.. తమ పేర్లను ప్రస్తావించడంపై వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు బుధవారం విలేకరుల సమావేశంలో మండిపడ్డారు. అంతేకాక కిషోర్‌రెడ్డి ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి పెడకంటి, పోకనాటి అనే భావన లేదన్నారు. అదే భావన ఉంటే నియోజకవర్గంలో పెడకంటి వర్గానికి ఇన్ని పదవులు వచ్చి ఉండేవి కావన్నారు. తాను 2013లో.. తిరిగి 2019లో డీసీసీ చైర్మన్‌గా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎంపీ అవినాష్‌ రెడ్డి ప్రోత్సాహం, కృషి వల్లనే అయ్యానన్నారు. గతంలో నియోజకవర్గంలో ఉపకులాల భావన ఉండేదని, ప్రస్తుతం ఎవరికి ఉపకులాల పట్ల ఎలాంటి భావనలు లేవని అందరూ కలిసిపోతున్నారన్నారు. అలాంటి సమయంలో కిషోర్‌ రెడ్డి ఉపకులాల ప్రస్తావన తేవడం శోచనీయమన్నారు. వైఎస్సార్‌ సీపీ నాయకుడని చెప్పుకుంటున్న కిషోర్‌రెడ్డి 2009 నుంచి 2011 వరకే వైఎస్సార్‌సీపీలో ఉన్నారని,.. తర్వాత ఏ ఎన్నికల్లో గాని సమావేశాల్లో గాని, పార్టీ కార్యక్రమాల్లో గానీ పాల్గొనలేదన్నారు. చాపాడు మండల మాజీ జెడ్పీటీసీ ఎస్సార్‌ బాలనరసింహారెడ్డి మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్యాయం చేసినట్టు కిషోర్‌రెడ్డి మాట్లాడటాన్ని ఖండించారు. మైదుకూరు మండలం మిట్టమానుపల్లెకు చెందిన బొర్రా సాంబశివారెడ్డి మాట్లాడుతూ తనకు జెడ్పీటీసీ పదవి ఇవ్వకుండా ఎమ్మెల్యే అన్యాయం చేశారని సంఘన కిషోర్‌రెడ్డి పేర్కొనడం శోచనీయమన్నారు. సమావేశంలో మైదుకూరు సింగిల్‌ విండో చైర్మన్‌ మూలే సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మత్స్యకాలనీలో రూ.35 లక్షలతో నిర్మించనున్న రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. త్వరగా పనులు చేపట్టి ప్రజలకు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పేరం సునీత బ్రహ్మానందరెడ్డి, మాజీ సర్పంచ్‌ గురుస్వామి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్‌ కాకర్ల నాగశేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ మార్తల ఓబుళరెడ్డి, రాజుపాళెం మండల కన్వీనర్‌ రాజారాంరెడ్డి, పూసల కార్పొరేషన్‌ డైరెక్టర్‌ తుపాకుల వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, డివిజన్‌ విజిలెన్స్‌ మానిటరింగ్‌ కమిటీ సభ్యుడు గాలిపోతుల సుదర్శన్‌, హిదాయత్‌, హౌస్‌ బిల్డింగ్‌ సొసైటీ చైర్మన్‌ ద్వార్శల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బద్వేలు అర్బన్‌ : స్థానిక 29వ వార్డులోని కుమ్మరికొట్టాలుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్లూరిపెద్దహసాన్‌ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌ సుధలు హసాన్‌ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే 17వ వార్డు కౌన్సిలర్‌ దుద్దుకూరి సత్యనారాయణ సోదరుని కుమారుడు అనిల్‌ బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

మైదుకూరు : మండల పరిధిలోని ప్రయాణికుల కోసం గురువారం డయల్‌ యువర్‌ డీఎం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌ కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు మండల పరిధిలోని ప్రయాణికులు సమస్యలు తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బందెల దొడ్డిలో ఉన్న పశువులను తోలుకెళ్లండి

రాజుపాళెం : గాదెగూడూరులోని బందెల దొడ్డిలో ఉన్న పశువులను తోలుకెళ్లాలని ఆ గ్రామ కావలి సంఘం సభ్యులు కోరుతున్నారు. రైతులు పంటలు సాగు చేసేటప్పుడు గ్రామంలో పంటలకు రక్షణగా కావలి మొదలవుతుంది. ఈ క్రమంలో గత నాలుగు రోజుల కిందట గాదెగూడూరు పంట పొలాల్లో పశువులు మేస్తుండటంతో వాటిని గ్రామ కావలివాళ్లు బందెల దొడ్డిలోకి తోలారు. సంబంధిత రైతులు పశువులను తోలుకెళ్లాలని సంఘం సభ్యులు కోరుతున్నారు.

సాయి హర్షితకు అభినందనలు



సాయిహర్షితను సన్మానిస్తున్న సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : గ్రూప్‌-1 పరీక్ష ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన వంకం సాయి హర్షిత భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని తొగటవీరక్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్‌ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో సాయిహర్షితను ఘనంగా సత్కరించి మాట్లాడారు. తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఉమ్మడిశెట్టి చౌడయ్య, ఏపీ టెక్స్‌టైల్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేషయ్య పాల్గొన్నారు.